క్లుప్తంగా

12 నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

సామర్లకోట: మండల పరిధిలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం, లైటింగ్, తాగునీటి సమస్యలు పరిష్కారానికి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ శిక్షణకు ప్రతి గ్రామానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

సామర్లకోట: పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. పార్టీ పట్టణ కార్యదర్శి ఏలేటి రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పలువురు నాయకులు పాల్గొన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



కొమరగిరిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రజనీ సుమారు 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కొమరగిరి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డీఏ రత్నరాజు, రాంబాబు, బీవీ రత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానానికి వ్యతిరేకంగా అనుమతులు

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్ రెన్యూవల్ పంచాయతీ తీర్మానాలకు వ్యతిరేకంగా జరిగాయని ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మలకల సూరిబాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పంచాయతీ అనుమతి లేకుండా, అక్రమంగా స్కూల్ భవన నిర్మాణం జరిగిందని ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పాఠశాలపై మొక్కుబడిగా విచారణ చేసి, అనుమతులు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాల భవనం పన్ను రసీదు లేకుండా ఎలా పాఠశాలను రెన్యూవల్ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేసి, పంచాయతీకి బకాయిలు వచ్చేలా చూడాలన్నారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోతే, కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు.

బస్ షెల్టర్‌కు శంకుస్థాపన

సామర్లకోట: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామివారిని, అమ్మ వార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భక్తుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేశారు. ఆలయానికి చేరుకోవడానికి దాతల సహకారంతో రైల్వేస్టేషన్ ఎదురుగా గోదావరి కాలువపై ఇనుప వంతెన నిర్మించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బస్సుల్లో వెళ్లడానికి ఇబ్బంది పడటంతో, ఇనుప వంతెన వద్ద బస్ షెల్టర్ నిర్మించడానికి భక్త సంఘం నాయకుడు తలుపుల అంజనీకుమార్ దాతగా ముందుకు వచ్చారు. కార్యక్రమంలో ఈఓ భళ్ల నీలకంఠం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కన్నీటి వరద..!



గొల్లప్రోలు సూరంపేట వద్ద వరద నీటిలో విద్యార్థుల ఇక్కట్లు



కొత్త కాలనీ వద్ద పొంగిపొర్లుతున్న సుద్దగెడ్డ



గొల్లప్రోలు కాలనీ వద్ద బోటులో వెళుతున్న స్థానికులు



నీట మునిగిన పత్తి చేలు

- గొల్లప్రోలుకు ఏటా తప్పని వరద ముంపు
- పుష్కర కాలువ, సుద్దగెడ్డలతో పొంచి ఉన్న ప్రమాదం
- ప్రస్తుత వర్షాలకు నీట మునిగిన కాలనీలు, పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు, రైతులు

పిఠాపురం: సాధారణంగా వర్షాలు పడితే పంటలు పండుతాయని రైతులు, ప్రజలు ఆశతో ఎదురుచూస్తారు. కాని అక్కడి ప్రజలు, రైతులు మాత్రం వర్షం వస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనపోరాటం చేస్తారు. ఈ పరిస్థితి ఏళ్ల తడబడి కొనసాగుతోంది. సుద్దగెడ్డను ఆధునీకరించక పోవడం వల్ల ఏటా ఈ పరిస్థితి తప్పడం లేదు. వేల ఎకరాలకు సాగునీరు అందించే ఏలేరు కాలువ గొల్లప్రోలు మండలంలో వరదగా మారి ప్రజలు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.

భారీ వర్షాలకు...

అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఏలేరు ప్రాజెక్టులోని అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు మండలంలోని పలు గ్రామాలు నీట మునిగాయి. గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు గొల్లప్రోలు మండలాన్ని ముంచెత్తింది. గత రెండు వారాలుగా వేసిన వరి నాట్లు, పత్తి, మిరప, ఇతర వాణిజ్య పంటలు నీట మునిగాయి. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు సూరంపేట వద్ద రహదారులు నీట మునగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఇప్పటివరకూ సుమారు 700 హెక్టార్లలో వరి, పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో మరింత వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

గగ్గోలు పెడుతున్న అన్నదాతలు

గొల్లప్రోలు మండలంలోని చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో లోతట్టు కాలనీలు నీట మునిగి వీధులు చెరువులుగా మారిపోయాయి. గొల్లప్రోలు సమీపంలో కొత్త కాలనీ వద్ద రహదారి పూర్తిగా జలమయమవ్వడంతో టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం పలు కాలనీలు వరద నీటిలోనే ఉండడంతో ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రమైంది. విద్యుత్ సౌకర్యాలు నిలిచిపోయాయి. ఇళ్ల నుంచి బయటకు రాలేని దుర్భర స్థితిలో ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ ఇప్పటివరకూ ఏవిధమైన సౌకర్యాలు కల్పించ లేదని బాధితులు వాపోతున్నారు.



గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన పంట పొలాలు

ఏటా ముంపు సమస్య



ఎన్నో ఏళ్లుగా పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నాం. ఏటా రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తుంటే దినదిన గండం నూరేళ్ల ఆయుస్సు అన్న చందాన ఉంటోంది మా పరిస్థితి. వర్షాలు కురిస్తే గొల్లప్రోలు మండలాన్ని వరద ముంచెత్తుతోంది. అదనపు జలాలు వెళ్లేందుకు సరైన కాలువలు లేక పంట పొలాలను వరద ముంచెత్తుతోంది. దీంతో ఆరుగాలం కష్టించి పండిస్తున్న పంటలు నీట మునిగి నష్టాల పాలువుతున్నాం. నా పొలం భోగాపురం, చిన జగ్గంపేట సరిహద్దుల్లో ఉంది. సుద్దగెడ్డ పొంగితే చాలు మా పొలాలు నీట మునుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా సుద్దగెడ్డను ఆధునీకీకరించి మా కష్టాలు తొలగించాలి.

కుంపట్ల రామకృష్ణ, రైతు, తాటిపర్తి

సమస్యల పరిష్కారానికి కార్మికుల ధర్నా



ఎపెక్స్ పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: వడ్లమూరు రహదారిలోని ఎపెక్స్ రొయ్యల పరిశ్రమలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉదయం విధులకు వెళ్లిన మహిళలు తమకు వేతనాలు పెంచాలంటూ నినాదాలు చేశారు. దీంతో సమస్య పరిష్కరిస్తామని వారిని లోపలికి రప్పించిన యాజమాన్యం.. ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో సీపీఎం నాయకులు పరిశ్రమ వద్ద నిరసన తెలిపి, పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ మహిళా కార్మికులకు రూ.330 వేతనం ఇస్తున్నారని, వారికి రూ.400 ఇవ్వాలన్నారు. పరిశ్రమలో తనిఖీలకు వచ్చే అధికారులకు మాత్రం కార్మికులకు రూ.600 వేతనం, పాలు ఇస్తున్నట్టు చెబుతున్నారన్నారు. అవాస్తవ హామీలతో యాజమాన్యం.. కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై అధికారులు చొరవ చూపాలని, లేని పక్షంలో కార్మికుల పక్షాన ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, డి.కృష్ణ, ఎస్.సూరిబాబు, అప్పన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ప్రారంభిస్తున్న ఈఓ నీలకంఠం, ఆలయ అర్చకులు



బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహిళల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఆలయంలో ప్రతి ఏడాది శ్రావణ మాస శుక్రవారాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ శ్రావణ మాసంలో తొలి, మూడు, నాలుగో శుక్రవారాల్లో పంచారామ క్షేత్రంలో మహిళలు సామూహిక వ్రతాలు చేసుకునేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. వ్రతాల్లో పాల్గొనే మహిళలు బియ్యం, కలశం. జాకెట్ ముక్క మాత్రమే తీసుకురాగా, వ్రతాలకు కావాల్సిన వరలక్ష్మి రూపు, తోరాలు, లక్ష్మీదేవి ఫొటో, గాజులు, పువ్వులు, ప్లేటు, ప్రమిదలు, వత్తులు, నూనె, ప్రసాదాలను దాతలు, దేవస్థానం సహకారంతో సమకూర్చారు. ఆలయ మొదటి అంతస్తు ప్రాకారం చుట్టూ వరలక్ష్మి వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతాలను ఈఓ భళ్ల నీలకంఠం, భక్త సంఘ నాయకులు లక్ష్మీదేవి చిత్రపటం వద్ద పూజలు చేసి, సామూహిక వ్రతాలను ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి, అళ్లక్కి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వ్రతాల్లో సుమారు 550 మంది మహిళలు పాల్గొన్నారు.

23, 30 తేదీల్లో..

అదేవిధంగా ఈ నెల 23, 30 తేదీల్లోని శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించనున్నట్టు ఈఓ నీలకంఠం తెలిపారు. ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో జరిగే సామూహిక వ్రతాలకు హాజరు కావాలన్నారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు భక్త సంఘం నాయకులు కంటే బాబు, తలుపుల అంజనీకుమార్, బస్వా శేషారావు సేవలందించారు.

విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలి

ఎంఈఓ శివరామ కృష్ణయ్య



పంతం పద్మనాభం ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

సామర్లకోట: ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని ఎంఈఓ వై శివరామ కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్, పంతం పద్మనాభం ఎలిమెంటరీ పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థులతో స్నేహంగా ఉంటే, వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా విద్యార్థుల్లో ఉపాధ్యాయులంటే భయం పోతుందన్నారు. పాఠ్యాంశాలను చదవడం, రాయడంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

జగన్ పేరు తొలగింపు దారుణం



ఇజ్జన తేజ

సామర్లకోట: ఎంతో ప్రశాంతంగా ఉండే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివాదాలు చెలరేగుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు ఇజ్జన తేజ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన చంద్రంపాలెంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 125 అడుగుల ఎత్తయిన విగ్రహానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించారన్నారు. విగ్రహాన్ని ప్రారంభించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తొలగించడం దారుణమన్నారు. గతంలో అనేక ప్రారంభోత్సవాలు చేసిన ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేల శిలాఫలకాలు ఇప్పటికీ అనేకం ఉన్నాయని చెప్పారు. తాజా సంఘటన దారుణమని, ఇటువంటి సంస్కృతి మంచిది కాదన్నారు.

ఫ్లైఓవర్‌పై గోతులను పూడ్పించిన ట్రాఫిక్ ఎస్సై



సామర్లకోట ఫ్లైఓవర్‌పై గోతులు పూడ్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై, ఏఎస్సై

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: ప్రమాదకరంగా స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులపై ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ప్రత్యేక దృష్టి సారించారు. బిజీగా ఉండే పోలీసులు సైతం, సామాజిక సేవలో మేము న్నామంటూ నిరూపించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇటీవల కురిసిన వర్షాలకు అడుగడుగునా గోతులు పడ్డాయి. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ కార్పొరేట్ కళాశాలలకు చెందిన బస్సుల రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై సాక్షిలో ట్రాఫిక్ సమస్యకు మోక్షం ఎప్పుడో.. అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ ఎస్సై స్పందించారు. గతంలో ట్రాఫిక్ ఎస్సైగా పని చేసిన గరగారావు ఎన్నికల సమయంలో గడివాడ ట్రాఫిక్ ఎస్సైగా బదిలీ అయిన విషయం విదితమే. తిరిగి సాధారణ బదిలీల్లో ఆయన సామర్లకోట ట్రాఫిక్ ఎస్సైగా మూడో రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. నిత్యం ట్రాఫిక్ స్తంభించడానికి కారణాలను గుర్తించి, గోతులను పూడ్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు అచ్చంపేట నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టరుతో మాట్లాడి, గోతులు పూడ్చడానికి అవసరమైన సిమెంట్ మిక్సింగ్ గ్రావెల్ ఇవ్వాలని కోరారు. దాంతో ట్రాక్టరు సిమెంట్ మిక్సింగ్ గ్రావెల్ లారీలు అక్కడకు రావడంతో, శుక్రవారం మధ్యాహ్నం ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నం, ట్రాఫిక్ సిబ్బంది గోతులను పూడ్పించారు. అలాగే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చేయాల్సిన పనిని ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- అపర్ణాదేవికి విశేష పూజలు
- కిటకిటలాడిన పాదగయక్షేత్రం



విశేష అలంకారంలో తాటిపర్తి అపర్ణాదేవి



కొత్తపల్లి కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ

పిఠాపురం: శ్రావణమాసంలో తొలి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం శ్రావణశోభను సంతరించుకుంది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పాదగయ కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో మహిళలు, భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్ల సన్నిధిలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. పలు దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: తహసీల్దార్‌గా కె చంద్రశేఖరరెడ్డి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో ఏలూరు నుంచి వచ్చిన వై శ్రీనివాసు తిరిగి ఏలూరు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. కాగా తహసీల్దార్ల నియామకంలో భాగంగా చంద్రశేఖరరెడ్డిని కలెక్టర్ నియమించారు.

తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి

పెద్దాపురం: పెద్దాపురం తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లాలో ఉన్న ఆమెను పెద్దాపురం తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విభిన్న ప్రతిభావంతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే చినరాజప్ప



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం: ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల్ని అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాల నమోదు కార్యక్రమం జరిగింది. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ పాటంశెట్టి నారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులైన ప్రతిఒక్కరికీ అర్హతను బట్టి ఆయా పరికరాలను త్వరలోనే అందజేస్తామన్నారు. ఏడీ నారాయణమూర్తి మాట్లాడుతూ మండలానికి సుమారు 400 మంది ఉపకరణాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. బ్యాటరీ చార్జింగ్ సైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, శ్రవణ యంత్రాలు, కృత్రిమ యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ తదితర వాటికి 197 మంది ఎంపికయ్యారని వివరించారు. మండలంలో 57 మందికి ఉచిత ఆర్టీసీ బస్సు పాస్‌లు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ పద్మావతి, మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆయువు పోసిన ఓ పిలుపు

కిడ్నీ వ్యాధి బాధిత బాలికకు ఆర్థిక సాయం



బాలిక కుటుంబానికి నగదు ఇస్తున్న సతీష్, హరీష్

కాకినాడ క్రైం: ఓ యూట్యూబ్ చానల్ ఇచ్చిన పిలుపు ఓ చిన్నారి నిండు ప్రాణాన్ని ఆదుకుంది. అందుకు శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్, బాబు పెరల్స్ యూట్యూబ్ చానల్ వేదికయ్యాయి. వివరాల్లోకి వెళితే, కాకినాడ జగన్నాథపురం ముత్తానగర్‌కు చెందిన ధర్మాడి స్వామి, సత్య దంపతుల పెద్ద కుమార్తె ఆరేళ్ల రాగ నిహారికకు కిడ్నీ సమస్య తలెత్తింది. మూడేళ్ల వయసులోనే ఓ మూత్రపిండాన్ని తొలగించారు. ఇటీవల మరో కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు గురైంది. తక్షణ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తేల్చారు. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో బాలికను చేర్చగా, రూ.5.6 లక్షల వ్యయం అవుతుందని వైద్యులు చెప్పారు. ఆ కుటుంబం శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థను ఆశ్రయించింది. సంస్థ వ్యవస్థాపకుడు సతీష్ బాబు పెరల్స్ అధినేత హరీష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిని హరీష్ తన యూట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలో రూ.2,70,104 సమకూరింది. ఈ మొత్తాన్ని సతీష్, హరీష్‌లు శుక్రవారం సాయంత్రం బాలిక తల్లిదండ్రులకు శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో అందజేశారు. దీనితో తొలి దశ ఆపరేషన్ పూర్తవుతుందని, తమ కుమార్తె ప్రాణం నిలబడుతుందని బాలిక తల్లిదండ్రులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి



ఫౌండేషన్ వంటశాలను పరిశీలిస్తున్న కమిషనర్

కాకినాడ: అన్న క్యాంటీన్లకు వచ్చే వారికి రుచికరమైన భోజనాన్ని అందించాలని హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. ఈ నెల 15 నుంచి అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో నగరవాసులకు అందించనున్న భోజన తయారీ, సరఫరాపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. వాకలపూడిలో హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వంటశాలను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఆహార తయారీ, అక్కడి వాతావరణం తదితర విషయాలను కమిషనర్ స్వయంగా గమనించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో భోజనం సమయానికి సరఫరా చేసే విషయమై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ క్యాంటీన్లను నగరంలోని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.